క్లుప్తంగా

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకు గోల్డ్ మెడల్ అందజేస్తున్న కరస్పాండెంట్ సంతోష, ఉపాధ్యాయులు

మొయినాబాద్ రూరల్: విద్యతో పాటు క్రమశిక్షణ నేర్పించినప్పుడే విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని వివేకావర్ధిని పాఠశాల కరస్పాండెంట్ సంతోష అన్నారు. శనివారం స్కూల్‌లో ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. చదువులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకంలో మెలకువలు పాటించాలి

పశువైద్యాధికారి స్ఫూర్తి

కొత్తూరు: గొర్రెలు, మేకల పెంపకంలో పశువైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని మండల పశువైద్యురాలు స్ఫూర్తి సూచించారు. మండలంలోని తీగాపూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో భాగంగా సుమారు 500 గొర్రెలకు బొబ్బ రోగం నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గొర్రెల్లో తరచుగా వచ్చే వ్యాధులతో పాటు సీజనల్ వ్యాధుల పట్ల గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జీవాలు రోగాల బారిన పడితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చికిత్సలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్రీలత, రవి, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి ప్రబలకుండా చర్యలు

కొందుర్గు: కుష్టువ్యాధి ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కొందుర్గు పీహెచ్‌సీ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం కొందుర్గు కేజీబీవీలో కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తి చెందుతుందని, ఇది అంటువ్యాధి కాదని, ఒకరి నుంచి మరొకరికి సోకదన్నారు. చర్మంపై తెల్ల మచ్చలు కనిపిస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనురాధ, ఉపాధ్యాయులు సునిత, రజిత, స్వప్న, శిరీష, ఏఎన్ఎం అలివేలు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మండలంలోని చందిప్ప గ్రామంలో మరకత శివాలయంలో మాఘ మాస పౌర్ణమి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మరకత శివాలయంలో ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

హెడ్ కానిస్టేబుల్ మృతి

షాద్‌నగర్: అనారోగ్యంతో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ మృతి చెందారు. ఈ ఘటన శనివారం షాద్‌నగర్ పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. షాద్‌నగర్ ఎక్సైజ్ పోలీస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సలీం (54) కుటుంబం పట్టణంలోని తిరుమల కాలనీలో నివాసం ఉంటోంది. ఆయన కొంత కాలంగా కాలేయం, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్నాడు. చికిత్స పొందుతున్న ఆయన శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు.

ఇల్లు దగ్ధం

కొందుర్గు: మండల కేంద్రంలో శనివారం ఓ ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన మహ్మద్ ఆజం ఇంటిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగానే కాలిపోయిందని స్థానికులు అంటున్నారు. మంటల్లో బీరువా, ఇతర సామగ్రి కాలి బూడిదయ్యిందని తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నారు.

వైభవంగా శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం

కేశంపేట: మండల పరిధిలోని పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల శివారులోని శ్రీ పద్మావతి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి వార్ల కల్యాణాన్ని భక్తులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి, గుట్టపైన దేవాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ గ్రామస్తుల సమక్షంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారి కల్యాణం నిర్వహించారు. సూరం కవిత శ్రీనివాస్, గుబ్బ సుమలత అనిల్‌కుమార్, కంచుకోట స్రవంతి రమేష్, కుమ్మరి అనురాధ నర్సింలు దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్లె ఆనంద్‌కుమార్, పల్లె బాలీశ్వర్, నిధురం కృష్ణయ్య, జగన్మోహన్‌రెడ్డి, అనుమగళ్ల రమేశ్, మల్లేష్‌గౌడ్, కుమార్‌గౌడ్, వేద పండితులు విక్రమ్, తిరుమల చారి, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు శిక్షణ తప్పనిసరి

- మెలకువలు తెలియకున్నా వాహనాలు నడుపుతున్నారు!
- తరుచూ ప్రమాదాలకు గురవుతున్న ఉద్యోగులు
- ఇటీవలే ఓ పంచాయతీ కార్మికుడి మృతి
- శిక్షణనిస్తే ప్రమాదాలు నివారించొచ్చు



ప్రమాద స్థలంలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు (ఫైల్)

కొందుర్గు: తెలంగాణ ప్రభుత్వం గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు 2019లో ప్రతీ గ్రామంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ కోసం మల్టీపర్పస్ వర్కర్స్‌ను నియమించింది. ప్రతీ 500 జనాభాకు ఒకరి చొప్పున జిల్లాలోని 558 గ్రామ పంచాయతీల్లో దాదాపు 3వేల మందికి పైనే విధుల్లో తీసుకున్నారు.

వీరు గ్రామంలో వీధులు శుభ్రం చేయడం, చెత్త సేకరించడం, వీధి దీపాలు అమర్చడం, వంటి పనులతోపాటు పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా చెత్తసేకణ చేయాలి. ట్రాక్టర్ల ద్వారా సేకరించిన చెత్తను గ్రామం వెలుపల ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డుల్లో పోయాలి. దీని కోసం మల్టీపర్పస్ ఉద్యోగులకు ఖచ్చితంగా ట్రాక్టర్ డ్రైవింగ్ వచ్చి ఉండాలి. మొక్కలకు నీళ్లు పోయడానికి ట్యాంకర్లతో ఉన్న ట్రాక్టర్లను కూడా నడపగలగాలి. దీనికోసం వారికి నెలకు రూ. 9,500/- పారితోషికం ఇస్తున్నారు.

అన్ని పనులు తెలియాలి..

మల్టిపర్పస్ వర్కర్స్ అంటే ప్రతీఒక్క కార్మికుడు అవసరాన్ని బట్టి వీధులు శుభ్రం చేయడం మొదలుకొని ట్రాక్టర్ నడిపేవరకు అన్ని పనులు చేయాలి. కానీ చాలమంది పనుల్లో నైపుణ్యం లేని వారు ఉంటున్నారు. ట్రాక్టర్ నడిపించాలంటే తప్పనిసరిగా డ్రైవింగ్ వచ్చి ఉండాలి. లైసెన్స్ కూడా తీసుకొని ఉండాలి. గ్రామాల్లో ట్రాక్టర్ నడపడం అంటే కష్టమే. ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. ప్రతిరోజు అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలి. సరిగ్గా నడపకపోతే గ్రామాల్లో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉంటాయి. ట్రాక్టర్ నడపడంలో సరైన నైపుణ్యం లేకపోతే డ్రైవర్ కూడా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంటుంది. అదేవిధంగా గ్రామంలో ఏమైన విద్యుత్ సమస్యలు ఉన్నా, స్తంభాలకు వీధి దీపాలు అమర్చాలన్నా ఇబ్బందే. ఈ పనిలో నైపుణ్యం లేకపోతే విద్యుత్ ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుంది.

ట్రాక్టర్ పైనుంచి పడి కార్మికుడి మృతి..

ఈ నెల 19న జిల్లేడ్ చౌదరిగూడ మండలం తూంపల్లి గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ కార్మికుడు చంద్రయ్య మరో కార్మికుడు కిష్టయ్యతో ట్యాంకర్‌లో నీటిని నింపుకొని మొక్కలకు పోయడానికి వెళుతుండగా ట్రాక్టర్ బోల్తాపడింది. కిష్టయ్య అక్కడికక్కడే మృతిచెందాడు.

అవగాహన ఉండే కార్మికులను నియమించాలి..



భవిష్యత్‌లో మరో కార్మికుడికి ప్రమాదం జరుగకుండా ఉండాలంటే డ్రైవింగ్‌లో అవగాహన ఉండే సిబ్బందిని నియమించాలి. అవసరం ఉన్నవారికి ప్రభుత్వం ఉచితంగా శిక్షణ ఇప్పించాలి.

– రాయికంటి గోపాల్, సీఐటీయూ, మండల కన్వీనర్

ప్రావీణ్యం బట్టి పనులు కల్పిస్తున్నాం..



గ్రామ పంచాయతీలో మల్టిపర్పస్ వర్కర్లు అన్ని పనులు చేయాల్సి ఉంటుంది. అయినప్పటికీ ఎవరికి ఏ పనిలో ప్రావిణ్యం ఉంటే ఆ పనే కేటాయించి చేయిస్తున్నాం. కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా కల్పించాం. మృతుడు కిష్టయ్య కుటుంబానికి రూ.2లక్షల బీమా వర్తిస్తుంది.

– విజయ్ కుమార్ పాల్, ఎంపీఓ, జిల్లేడ్ చౌదరిగూడ

బాలల పరిరక్షణ అందరి బాధ్యత

సీడీపీఓ శోభారాణి



కేజీబీవీ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న శోభారాణి

చేవెళ్ల: బాలల పరిరక్షణ అందరి బాధ్యత అని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శోభారాణి పేర్కొన్నారు. కేజీబీవీ పాఠశాలలో శనివారం బాలల హక్కులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకుంటేనే వారి కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వం బాలికల రక్షణకోసం అనేక చట్టాలను తీసుకొచ్చిందన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మికుల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

పిల్లలు ఎక్కువగా చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారని, మత్తు మందులు సేవించటం వల్ల వారి జీవితాలను నాశనం చేసుకంటున్నారని చెప్పారు. అలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. చిన్నప్పటినుంచే లింగవివక్షత లేకుండా పెంచాలన్నారు. మహిళా సాధికారత సాధించాలంటే మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని చెప్పారు. ఏమైనా సమస్యలు ఎదుర్కొంటుంటే హెల్ప్‌లైన్ నెంబర్ 1098కు ఫోన్‌చేసి సమాచారం చేరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మీ, కేజీబీవీ ఇన్‌చార్జి శ్వేత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు కలుషితం

ఇబ్బందుల్లో జనం

- పట్టించుకోని అధికారులు



వృథాగా పోతున్న నీరు

షాబాద్: మండల కేంద్రంలోని జ్యోతిరావుపూలే విగ్రహం పక్కనే ఉన్న ముంబాయి-బెంగళూరు హైవే రోడ్డు బ్రిడ్జి కింద మిషన్ భగీరథ పైపులైన్ పలిగిపోయాయి. దీంతో ఇక్కడ వరదలా మారి, కుంటను తలపిస్తుంది. దీంతో ఇక్కడి నుంచి పైప్‌లైన్లో కలుషితం అవుతుందని ప్రజలు వాపోతున్నారు. అక్కడ పైప్‌లైన్లు పగలడంతో మురుగుగా మారి మంచి నీరు కలుషితం అవుతుందని చెబుతున్నారు. ఈ నీటిని తాగడంతో రోగాల బారిన పడుతున్నట్లు చెబుతున్నారు. సంవత్సరాలు గడుస్తున్నా ఈ విషయాన్ని అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, జనం పడుతున్న ఇబ్బందిని పరిష్కరించాలని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి పైప్‌లైన్ లీకేజీని మరమ్మతులు చేయించి స్వచ్ఛమైన నీటి సరఫరా కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

టంగటూరు మాజీ సర్పంచ్ గోపాల్



మొక్క నాటుతున్న ఎఫ్ఏఎస్, బాల వికాస్ ప్రతినిధులు

శంకర్‌పల్లి: మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని మాజీ సర్పంచ్ గోపాల్ పేర్కొన్నారు. బాల వికాస్ ఆధ్వర్యంలో ఎఫ్ఏఎస్ సహకారంతో గ్రామంలోని శివాలయం, మారయ్య దేవాలయ ప్రాంగణంలో పండ్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు మానవాలికి ప్రాణ వాయువును అందిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సత్యనారాయణ గౌడ్, ఎఫ్ఏఎస్ ప్రతినిధులు శశి, చక్రి, నందిని, బాల వికాస్ ప్రతినిధులు విక్రం, రెహమాన్, రాజ్‌కుమార్, గ్రామ కార్యదర్శి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ విద్యలో రాణించాలి

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



బెల్టులు అందుకున్న విద్యార్థులతో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: విద్యార్థులు యుద్ధ విద్యల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలో పరిగి రోడ్డులోని యూనిక్ పాఠశాలలో న్యూ పవర్ కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే, కుంగ్‌ఫూ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన వారికి బహుమతుల ప్రదానం చేశారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ చదువుతో పాటు యుద్ధ విద్యలు నేర్చుకోవడం అభినందించదగ్గ విషయమన్నారు. ఇవి ఆపద సమయంలో శత్రువుల నుంచి తమను తాము రక్షించుకునేందుకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. యుద్ధ విద్యలతో శరీరం ధృడంగా తయారవుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుతో పాటుగా, ఆట పాటల్లో ఆసక్తి కల్పించి ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ మాస్టర్లు బాల్‌రాజ్, అహ్మద్‌ఖాన్, ట్రాఫిక్ ఎస్ఐ రవీందర్ నాయక్, పాఠశాల ప్రిన్సిపాల్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ఎంపీడీఓ వెంకయ్య గౌడ్



మాట్లాడుతున్న వెంకయ్య గౌడ్

శంకర్‌పల్లి: గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య గౌడ్ పేర్కొన్నారు. శనివారం శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గ్రామాల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులతో వారాంతపు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యను పరిష్కరించాలన్నారు. పన్ను వసూలు వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ గీత, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ రవీందర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు

చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్



కాంగ్రెస్‌లో చేరిన ఆలాస్‌ఖాన్‌గూడ మాజీ సర్పంచ్‌లు

శంకర్‌పల్లి: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తథ్యమని, ప్రతీ కార్యకర్తలు కృషి చేయాలని పామెన భీంభరత్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఆలాస్‌ఖాన్‌గూడ మాజీ సర్పంచ్‌లు సామ్యవెంకటేశ్, అనంత్‌రెడ్డిలు తన అనుచరులతో పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. శంకర్‌పల్లి మాజీ సర్పంచ్ శ్రీధర్, సింగాపురం, మాజీ ఎంపీటీసీ రాంచందర్, శ్రీశైలం, బుచ్చిరెడ్డి, జైపాల్, కృష్ణ, రఘు, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

గొప్ప ఆధ్యాత్మికవేత్త సంత్ రవిదాస్

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య

షాద్‌నగర్: గొప్ప ఆధ్యాత్మికవేత్త సంత్ రావిదాస్ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య పేర్కొన్నారు. హిందు ధర్మ ప్రచారకర్త సంత్ రవిదాస్ జయంతి వేడుకలను శనివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎంకనోళ్ల వెంకటేశ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అందెబాబయ్య రవిదాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు రవిదాస్ ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. గ్రామ గ్రామాన తిరుగుతూ ప్రజలకు ఆధ్యాత్మిక బోధనలు చేస్తూ ప్రజలను సన్మార్గం వైపు నడిపించారన్నారు. దేశం, ధర్మం కోసం పోరాటం చేసిన వారికి ప్రజల గుండెలో స్థానం ఉంటుందన్నారు.



నివాళులర్పిస్తున్న అందెబాబయ్య

ప్రమాదకరంగా మలుపు!

సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని మొర



మొదళ్లగూడ సమీపంలోని మలుపు

నందిగామ: మండల పరిధిలోని వీర్లపల్లి నుంచి మొదళ్లగూడ వెళ్లే రహదారిలో దర్గా సమీపంలోని మూల మలుపు ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ఎదురుగా వస్తున్న వాహనం కనపడకుండా ఈ మూల మలుపు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. ఈ రహదారిగుండా ప్రయాణిస్తే అప్రమత్తంగా ఉండాలి. వాహనాలు ఏ మాత్రం అదుపు తప్పితే రోడ్డు పక్కకు దూసుకుపోయే ప్రమాదం ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మూల మలుపులను సరిచేయాల్సిన అవసరం ఉంది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి సూచికబోర్డులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

'నూతన ఆలోచనలకు పదును పెట్టాలి'

మొయినాబాద్: సాంకేతిక రంగ విద్యార్థులు నూతన ఆలోచనలకు పదును పెట్టి సమాజాభివృద్ధికి తోడ్పడాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మాజీ డైరెక్టర్ హెచ్‌పీ సింగ్ పేర్కొన్నారు. చిలుకూరు రెవెన్యూలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ పరిశోధన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అవరోధాలను గుర్తించి వాటికి నిర్మాణాత్మకమైన పరిష్కారాలను చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యూఢిల్లీ పంచాయతీరాజ్ శాఖ కన్సల్టెంట్ ఎండీ ఖాన్, కళాశాల డైరెక్టర్ రోహిత్ కందకట్ల, ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి, కన్వీనర్ ఎల్‌జే హరి, ఏఓ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. హెచ్ఎంగా దివ్యశ్రీ, ఎంఈఓగా శ్రీవర్ధన్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, భాగ్యలక్ష్మి, రాములు, శివాజీ పాల్గొన్నారు.

వైద్యశిబిరాలతో పేదలకు మేలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

షాబాద్: ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు జరుగుతుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి సతీమణి ఎలుగంటి కవిత మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి డాక్టర్ దామోదర్‌రెడ్డి, ఎలుగంటి కవిత మధుసూదన్‌రెడ్డి సహకారంతో నిర్వహించారు. కంటి చూపు, క్యాన్సర్, బాడి చెకప్, స్కానింగ్ నిర్వహించి 180 మంది రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించేందుకు వైద్యులు ముందుకురావాలని సూచించారు.

ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజ



చేవెళ్ల: పడిపూజలో పాల్గొన్న శివస్వాములు

చేవెళ్ల: మండలంలోని తంగడపల్లి గ్రామంలో శనివారం సురేశ్ గురుస్వామి ఆధ్వర్యంలో మహాపడిపూజ నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి పడిపూజ చేశారు. శబరీష భజన మండలి జంగిరెడ్డి భక్తి గీతాలు పాడారు. ఈ పడిపూజలో వచ్చిన స్వాములకు, భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సత్తయ్యగౌడ్, రాములుగౌడ్, చంద్రయ్యగౌడ్, గోపాల్‌రెడ్డి, జనార్దన్‌గౌడ్, గురుస్వాములు వీరభద్ర, గుండాల రాములు, స్వాములు విష్ణువర్ధన్‌రెడ్డి, నవీన్‌గౌడ్, శేఖర్, పరమేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వర ఆలయంలో..

మొయినాబాద్ రూరల్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా సంగమేశ్వర దేవాలయ ప్రాంగణం శివ నామస్మరణతో మారుమోగింది. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు స్వామి వారికి అభిషేకాలు, దివ్య రథోత్సవం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమాలు నిర్వహించిన అనంతరం గర్భ గుడిలో శివలింగానికి పూజలు, మహా మంగళహారతి, నైవేద్యం సమర్పించారు.

కొందుర్గు: మండల కేంద్రం శనివారం శివనామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా గురుస్వామి భూపాలచారి ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాలచారి మాట్లాడుతూ శివస్వాములు భక్తిశ్రద్ధలతో దీక్షలు చేస్తే ముక్తి లభిస్తుందన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి సత్యనారాయణ, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.